పదో తరగతి విద్యార్థి అదృశ్యం

ముదినేపల్లి :పదో తరగతి చదువుతున్న విద్యార్థి అదృశ్యమైన సంఘటన ముదినేపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ముదినేపల్లికి చెందిన అబ్దుల్‌సలాం కుమారుడు అబ్దుల్ మహమ్మద్ సల్మాన్ స్థానిక ప్రయివేట్ స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. ఈ నెల 19వ తేదీ శుక్రవారం స్కూలుకు వెళ్లిన సల్మాన్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి ఇంటి నుంచి స్కూల్‌కి వెళ్లకుండా బయటకు వెళ్లిపోయాడు. దీంతో పాఠశాల యాజమాన్యం ఇంటికి ఫోన్ చేసి సల్మాన్ స్కూలుకు రాలేదంటూ సమాచారం అందించారు. దీంతో భయాందోళనకు గురైన సల్మాన్ తల్లిదండ్రులు బంధువుల, స్నేహితుల ఇంటా గాలించినా ఆచూకీ తెలియ రాలేదు. దీంతో తన కుమారుడు కనబడటం లేదంటూ శనివారం రాత్రి పది గంటలకు ముదినేపల్లి పోలీసులకు విద్యార్థి తండ్రి అబ్దుల్ సలాం ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

నేవీ ఆయుధ డిపోపై..
బిజెపి కపట నాటకం..!

'నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై బిజెపి నేతలు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారా అంటే అవుననే సమాధానం వస్తోంది. నేవీ ఆయుధ డిపో ప్రకటన రాగానే హర్షం వ్యక్తం చేసిన స్థానిక కాషాయ నేతలు జనం తిరుగుబాటు చూసి లోలోన ఎలాగున్నా పైకి మాత్రం తామూ వ్యతిరేకిస్తున్నామంటూ నినదిస్తూ ప్రజల్లో చీలిక తెచ్చే ప్రయత్నాలు సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నేవీ యుద్ధ సామగ్రి డిపో వద్దని డిసెంబర్ 12న గ్రామ సభలో తీర్మానించినా మళ్లీ ఈ నెల 20న తాజాగా రెండోసారి గ్రామసభ నిర్వహణ వెనుక కాషాయ నేతల కపట నాటకం దాగి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోసారి నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సంబంధించి ఇక్కడకు వస్తే అధికారులా ఖబడ్దార్ అంటూ వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలు హెచ్చరిస్తున్నారంటే అక్కడి ప్రజల్లో ఎంత వ్యతిరేకత ఉందో స్పష్టమవుతోంది.

అధికారుల కారుకు అడ్డంగా కూర్చుని నిరసన తెలుపుతున్న గిరిజనులు

- డిపో ఏర్పాటును వ్యతిరేకిస్తూ డిసెంబర్ 12న గ్రామసభ తీర్మానం
- మళ్లీ 20న గ్రామసభ ఏర్పాటుపై అధికారులను నిలదీసిన జనం
- ముందు హర్షం.. ఆపై వ్యతిరేకమంటూ బిజెపి నేతల ద్వంద్వ వైఖరి
- జనాల్లో చీలిక తెచ్చేందుకు బిజెపి నేతల కొత్త నాటకమంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో 1,166 ఎకరాల్లో ఏర్పాటు చేయదలచిన నేవీ యుద్ధ సామగ్రి డిపోను అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా ముందుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా బలవంతంగా నేవీడిపో ఏర్పాటు చేయాలని మూర్ఖంగా వ్యవహరిస్తోంది. వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో వంకావారిగూడెం, మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, కొత్తచీమలవారిగూడెం, రమణక్కపేట మొత్తం ఐదు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో నేవీ యుద్ధసామగ్రి డిపో ఏర్పాటుకు కేంద్రంలోని మోడీ సర్కార్ పూనుకుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోంది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గిరిజనులు చెట్టుకొకరు పుట్టకొకరు అన్నట్లు తయారయ్యారు. ప్రాజెక్టుతో నిర్వాసితులుగా మారిన గిరిజనులకు పునరావాస పరిహారం కూడా సక్రమంగా ఇవ్వకుండా బలవంతంగా ఇళ్లను ఖాళీ చేయించి గెంటేశారు. అక్కడ నుంచి జీలుగుమిల్లి మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కాలనీలకు గిరిజనులను తరలించారు. మరికొన్ని కుటుంబాలు తరలిరావాల్సి ఉంది. ఇప్పుడు జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నేవీ యుద్ధసామగ్రి డిపో ఏర్పాటు పేరుతో అక్కడ నుంచి కూడా గిరిజనులను తరిమివేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి. దీంతో నేవీ యుద్ధ సామగ్రి డిపోను అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నేవీ డిపో ఏర్పాటైతే వచ్చే ఆంక్షలు, ఇబ్బందులు చాలా తీవ్రంగా ఉంటాయి. జీలుగుమిల్లి మండలంలో నివసించే ప్రజలంతా తీవ్ర ఆంక్షల నడుమ జీవనం సాగించాల్సి వస్తుంది. నేవీ డిపో ఏర్పాటుకు సంబంధించి గ్రామసభ తీర్మానం తప్పనిసరి. దీంతో గడిచిన డిసెంబర్ 12న అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభకు పెద్దఎత్తున హాజరైన గిరిజనులు, ఇతరులు సైతం నేవీ డిపోను తీవ్రంగా వ్యతిరేకించారు. వంకావారిగూడెం సర్పంచి కుంజా పార్వతి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో నేవీ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానం చేశారు. ఒకసారి గ్రామసభ తీర్మానం అయ్యిందంటే దానికి తిరుగుండదు. అధికారుల మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఈ నేపథ్యంలో ఈ నెల 20న మరోసారి గ్రామసభ ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నేవీ డిపోను వ్యతిరేకిస్తూ తీర్మానించాక మరోసారి గ్రామసభ ఏర్పాటు వెనుక ఉద్దేశం ఏమిటంటూ అక్కడకు వచ్చిన జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం తహశీల్దార్లను నిలదీశారు. గ్రామసభ తీర్మానంలో తహశీల్దార్లు సంతకాలు చేయకుండా వెళ్తే కుదరదంటూ కారుకు అడ్డంగా కూర్చుని నిరసన తెలిపారు. దీంతో నేవీ డిపోను వ్యతిరేకిస్తూ చేసిన గ్రామసభ తీర్మానంలో తహశీల్దార్లు సైతం సంతకాలు చేశారు. గిరిజనులు వద్దంటున్నా అక్కడే నేవీ డిపో ఏర్పాటుకు మోడీ సర్కార్ బరి తెగించడం, దానికి రాష్ట్ర ప్రభుత్వం వంతపాడుతున్న తీరుపై అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

బిజెపి నాయకుల దొంగాట..!

వంకావారిగూడెంలో నేవీ డిపో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన వచ్చిన వెంటనే స్థానిక బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేసి గొప్పలు చెప్పారు. డిపో రావడం మంచి పరిణామమని, అందరికీ మేలు జరుగుతుందని మోడీని పొగడ్తలతో ముంచెత్తారు. అయితే అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తుండటంతో మాట మార్చి ప్రజలకు మద్దతుగా నిలుస్తున్నట్లు మాట్లాడుతున్నారు. దీనిపైనే అందరిలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బిజెపి నాయకుల ఉద్దేశం వేరే ఉందని, ఆయుధ డిపోను వ్యతిరేకిస్తున్నట్లు ప్రజల వద్దకు వెళ్లి, తర్వాత వారిలో చీలికలు తెచ్చి డిపో ఏర్పాటుకు అనుకూలంగా గ్రామసభ తీర్మానం చేయించాలని చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజంగా స్థానిక బిజెపి నేతలు నిజంగానే నేవీ డిపోను వ్యతిరేకిస్తే బిజెపి రాష్ట్ర నాయకులతో మాట్లాడి తమ అభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించాలి. అలాకాకుండా పూటకో మాట మాట్లాడితే తగిన గుణపాఠం తప్పదని అక్కడి ప్రజలు హెచ్చరిస్తున్నారు.

చింతలపూడి, కొయ్యలగూడెం మండలాల్లో అంగన్‌వాడీలకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

విజయవాడ తరలిన అంగన్వాడీలు

అడుగడుగునా పోలీసుల తనిఖీలు
పలువురికి ముందస్తు నోటీసులు



ఆగిరిపల్లిలో కోటేశ్వరరావుకు నోటీసు ఇస్తున్న ఎఎస్‌ఐ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి, ఏలూరు

తమ గోడును జగనన్నకు చెప్పుకునేందుకు అంగన్వాడీలు ఆదివారం విజయవాడ తరలివెళ్లారు. జిల్లా నుంచి సుమారు మూడు వేల మంది అంగన్వాడీలు విజయవాడ పయనమైనట్లు అంచనా. అయినప్పటికీ ఆదివారం ఉదయం నుంచే పోలీసులు పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్లు, బస్టాండులపై నిఘా పెట్టారు. అదే సమయంలో అన్ని మండలాల్లో అంగన్వాడీ, సిఐటియు, కార్మిక నేతలకు విజయవాడ వెళ్లొద్దంటూ ముందస్తు నోటీసులు జారీ చేశారు. కొయ్యలగూడెం, చింతలపూడి, లింగపాలెం, టి.నర్సాపురం, ముసునూరు తదితర మండలాల్లో నోటీసులు ఇచ్చారు. పలువురు అంగన్వాడీ నేతలను గృహనిర్బంధం చేశారు. ఆగిరిపల్లిలో సిపిఎం నేత సత్తు కోటేశ్వరరావుకు, అంగన్వాడీలకు నోటీసులిచ్చారు.

ముదినేపల్లి: 41 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ఏమాత్రం పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరించడం దారుణమని కెవిపిఎస్ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు దాకరపు నాగేశ్వరరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యమం తీవ్రరూపం దాల్చుతుందని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఏలూరులో కరపత్రాలు పంచుతున్న ఐద్వా నేతలు

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమానికి అరుణ, రిబ్కా, పద్మ, మణి నాయకత్వం వహించారు.

అంగన్వాడీలకు మద్దతుగా ఐద్వా ప్రచారం

ఏలూరు అర్బన్: అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఐద్వా జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని పవర్‌పేట, చోడిదిబ్బ, సుబ్బమ్మదేవి స్కూల్, రామచంద్రరావుపేట తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంచుతూ వీధి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి మాట్లాడుతూ 40 రోజులుగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చకుండా మాట మార్చడం తగదన్నారు. వారి న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అంగన్వాడీలకు మద్దతుగా కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కళ్యాణి, రాజేశ్వరి, దుర్గా, రేష్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

ప్రభుత్వానికి వామపక్షాల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

40 రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపుతూ, తక్షణం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ జిల్లాలోని వామపక్ష పార్టీలు కలెక్టర్‌కు ఆన్‌లైన్‌లో వినతిపత్రాన్ని పంపాయి. దీనికి సంబంధించి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు (యువి), ఎంసిపిఐ రాష్ట్ర నాయకులు శానం నాగరాజు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్ ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారని, సమ్మె విచ్ఛిన్నానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా ధైర్యంగా నిలబడి ముందుకు సాగుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్వాడీలు కోరడం అన్యాయమా అని వారు ప్రశ్నించారు. అంగన్వాడీలు, వారి యూనియన్ నేతలతో చర్చించి సమస్య పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించడంతోపాటు దారుణమని పేర్కొన్నారు. సెంటర్ల తాళాలు బద్దలుకొట్టడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, తాజాగా టెర్మినేట్ చేస్తూ లేఖలు పంపడం సమస్యను మరింత జఠిలం చేయడమేనని తెలిపారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా అంగన్వాడీలు కోరుతున్నట్లుగా కనీస వేతనం రూ.26 వేలు జీతం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతిఒక్కరికీ గ్రాడ్యూటీ చెల్లించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలని, జీవితంలో సగం రిటైరైన తర్వాత పెన్షన్ రూపంలో ప్రతినెలా అందించాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్‌గా గుర్తించాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని వారు కోరారు.

భూసేకరణ పనులు ఆపాలి : ఆదివాసీ గిరిజన సంఘం

జీలుగుమిల్లి:మండలంలోని వంకావారిగూడెం పంచాయతిలో నిర్మించ తలపెట్టిన అదాని ఆయుధ కార్మాగార డిపో భూసేకరణ పనులను నిలుపుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా నాయకులు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. వంకావారిగూడెం పంచాయతీ కార్యాలయంలో స్థానిక తహశీల్దార్ సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన రెండు గ్రామసభల్లో ఐదు గ్రామాల గ్రామస్తులందరూ ముక్తకంఠంతో ఆయుధ కార్మాగారం నిర్మించవద్దని ఏకగ్రీవంగా తీర్మానించరాని తెలిపారు. గ్రామసభ తీర్మానం ప్రకారంగా ఆయుధ కార్మాగారన్ని, నిర్మాణ భూసేకరణ పనులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో సుమారు 1166 ఎకరాల భూముల్లో నేవీ ఆయుధ కార్మాగారం నిర్మించేందుకు భూసేకరణకు రమణక్కపేట, దాట్లవారిగూడెం, కొత్త చీమలవారిగూడెం, వంకావారిగూడెం గ్రామాలకు చెందిన ఆదివాసీల భూముల సేకరించేందుకు ప్రణాళికలు చేసినట్లు తెలిపారు. దానికి సంబంధించి రెవెన్యూ అధికారుల సమక్షంలో శనివారం జరిగిన గ్రామసభలో ఆయా గ్రామ ప్రజలు భూ సేకరణ చేయటానికి వీలు లేదని అధికారుల సంతకాలతో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. గ్రామ సభ తీర్మానం ప్రకారంగా ఆయుధ కార్మాగార నిర్మాణాన్ని వెంటనే ఆపాలని, భూ సేకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఏ ప్రాజెక్టు నిర్మాణాన్నికైనా భూ సేకరణ చేయాలంటే గ్రామసభ ఆమోదం తప్పనిసరన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో గ్రామసభలకు విస్తృతమైన అధికారాలు ఉన్నాయన్నారు. గ్రామసభలో ఆయుధ కార్మాగార బాధిత ఆదివాసీలు భూసేకరణ చేయవద్దని, ఆయుధ కార్మాగారం నిర్మించవద్దని తీర్మానం ప్రకారం తక్షణమే భూ సేకరణ ఆపి నిర్మాణ ఒప్పందాన్ని నిలుపుదల చేయాలని కోరారు. లేకపోతే రాష్ట్రంలోని ఆదివాసీల ఆగ్రహాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి చేయాలి

శత వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

లెనిన్ ఆశయాలు, ఆలోచనలు నేటి సమాజ మార్పు కోసం, సమ సమాజ స్థాపన కోసం అవసరమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సోవియట్ రష్యాలో విప్లవాన్ని జయప్రదం చేసి కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించడంలో ముఖ్యపాత్ర వహించిన లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం ఆదివారం పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షత వహించారు. లెనిన్ చిత్రపటానికి సీనియర్ నాయకులు కంది విశ్వనాథం, పిచ్చుక ఆదిశేషు పూలమాల వేసి నివాళులర్పించారు. మిగిలిన సభ్యులు చిత్రపటం ముందు పూలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ అణగారిన ప్రజల విముక్తి కోసం, సమసమాజ స్థాపన కోసం లెనిన్ చేసిన కృషిని ఆయన కొనియాడారు. కారల్‌మార్క్స్ రూపొందించిన సిద్ధాంతాన్ని ఆచరణలో ప్రవేశపెట్టి 1917లో సోవియట్ రష్యాలో విప్లవాన్ని సాధించడంలో లెనిన్ ముఖ్యపాత్ర వహించాడన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.శ్యామలరాణి, ఏలూరు సిటీ నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, కనకారావు, కోటేశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకులు లెనిన్ పాల్గొన్నారు.

టి.నరసాపురంలో...

విప్లవ సారథి లెనిన్‌ను ఆదర్శంగా తీసుకుని బూర్జువ వర్గానికి వ్యతిరేకంగా శ్రమ జీవులను ఏకం చేసి విప్లవ పోరాటాలు చేయడం ద్వారానే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని ఉభయ కమ్యూనిస్టు పార్టీల నాయకులు పునరుద్ఘాటించారు. విప్లవ సారథి లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ, సిపిఎం జిల్లా శాఖల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం, ప్రజాశక్తి బుక్‌హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన లెనిన్ చిత్రపటంతో ఉన్న క్యాలెండర్‌ను, లెనిన్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ లెనిన్ మరణించి వందేళ్ళ అయినప్పటికీ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగ ప్రభాకర్ మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో సోషలిస్టు రాజ్య వ్యవస్థ స్థాపనకు కమ్యూనిస్టులందరూ నడుం బిగించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రపంచంలో సమసమాజ స్థాపనను కార్ల్ మార్క్స్ అందించారన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని లెనిన్ రష్యాలో తొలి శ్రామిక వర్గ విప్లవాన్ని తీసుకొచ్చారన్నారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ లెనిన్ ఆశయ సాధన కోసం ఉభయ కమ్యూనిస్టు పార్టీలు కృషి చేసి భారతదేశంలో కూడా సామాజిక విప్లవం తీసుకురావాలన్నారు. తద్వారా కార్మిక, కర్షకవర్గ రాజ్య స్థాపన చేయాలన్నారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కె.వరప్రసాద్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా కోశాధికారి పి.కన్నబాబు, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఆర్గనైజర్ హరిప్రియ పాల్గొన్నారు.

టి.నరసాపురం : తొలి శ్రామిక వర్గ విప్లవ నిర్మాత లెనిన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సిపిఎం మండల నాయకులు అనుమోలు మురళి అన్నారు. మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. లెనిన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఈ తరం ప్రజలందరూ లెనిన్ గురించి తెలుసుకోవాలన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడకం కుమారి, బరగడ కుమారి, చెల్లెమ్మ, అమ్మాజి పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : ఆగిరిపల్లి సుందరయ్య భవనంలో లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కమ్యూనిస్టు నాయకులు మువ్వా రాజారావు, సత్తు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతు శాస్త్రవేత్త కోర్సు అద్భుతం

డిగ్రీ చదివి వ్యవసాయం చేయడం ప్రశంసనీయం
కొనసాగిన బంగ్లాదేశ్ బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్న బృందం

ప్రజాశక్తి - ఉంగుటూరు

పంట పండించే వారి సంఖ్య తగ్గుతూ తినే వారి సంఖ్య పెరుగుతున్న నేటి రోజుల్లో రైతు సాధికార సంస్థ రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతు శాస్త్రవేత్త కోర్సు ప్రపంచానికి ఆదర్శమని బంగ్లాదేశ్ ప్రతినిధి బృందం ప్రశంసించింది. రాష్ట్రంలో మూడో రోజు పర్యటనలో భాగంగా ఆదివారం బంగ్లాదేశ్ బృంద సభ్యులు ఉంగుటూరు మండలంలోని వెంకటరామన్నగూడెం, పెద్ద వెల్లమిల్లి, నాచుగుంట గ్రామాల్లోని వేర్వేరు రైతుల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పెద్దవెల్లమిల్లిలోని రాజేంద్రప్రసాద్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్‌లతో బృంద సభ్యులు సమావేశమయ్యారు. రైతు శాస్త్రవేత్తలను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యవసాయంలో డిగ్రీ కలిగిన వ్యవసాయ నిపుణులు ఒకవైపు ప్రకృతి వ్యవసాయం చేస్తూనే రైతులకు సలహాలు సూచనలు అందిస్తూ ఎటిఎం ఎ గ్రేడ్, ఐదు అంతస్తుల నమూనా సమీకృత మోడల్ తదితర ఆదర్శనీయ వ్యవసాయ క్షేత్రాలను తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. రైతు శాస్త్రవేత్తల్లో మహిళలు కూడా అధిక సంఖ్యలో ఉండటం వ్యవసాయంలో మహిళల ప్రోత్సాహానికి అద్దం పడుతోందన్నారు. దీనికి ముందు వెంకట రామన్నగూడెంలోని ఎకరా విస్తీర్ణంలో అనుసరిస్తున్న పాలి వెజిటబుల్ మోడల్‌ను సందర్శించింది. ప్రకృతి వ్యవసాయ విధానంలో వరితోపాటు ఫిష్ పాండ్, 20 రకాల పండ్లు, కూరగాయలు పండిస్తున్నట్లు చెప్పారు. నాచుగుంటలోని జి.వెంకటరత్నాజీ వ్యవసాయ క్షేత్ర పరిధిలోని 70 ఎకరాల కాంపాక్ట్ బ్లాక్‌ను సందర్శించారు. అనంతరం విజయవాడ తిరిగి వెళ్తూ మార్గమధ్యంలో ఆర్గానిక్ స్టోర్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్‌కు అరుణ, శ్రీరాము, ఏలూరి సురేష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అదనపు డిపిఎం వలీ పాల్గొన్నారు.

బహుజనుల సమగ్రాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం

ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రంలో బహుజనుల సమగ్రాభివృద్ధి సిఎం జగన్‌తోనే సాధ్యమని, సమాజంలో పేద, బలహీన వర్గాలకు జగనన్నతోనే భరోసా వచ్చిందని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. ఏలూరు మినీ బైపాస్‌లోని క్రాంతి కళ్యాణ మండపంలో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. జగన్ నిర్దేశించిన విధంగా ఏలూరు ఎంపీ సమన్వయకర్తగా కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను జిల్లాలోని పార్టీ శ్రేణులు, నేతలకు పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌యాదవ్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని, మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను ఏలూరులో జెడ్‌పి ఛైర్మన్‌గా పని చేశానని, సిఎం జగన్ ఆదేశాల మేరకు ఏలూరు ఎంపీగా సునీల్‌కుమార్ పోటీ చేస్తున్నారని, ఆశీర్వదించాలని కోరారు. సునీల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సిఎం జగన్ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించారని,

మాట్లాడుతున్న ఆళ్ల నాని

విజయం సాధించి తీరుతామని తెలిపారు. జిల్లాలోని ఎంఎల్‌ఎలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తానని చెప్పారు. తన తండ్రి కారుమూరి నాగేశ్వరరావు ఏలూరు నుంచే రాజకీయాలు ప్రారంభించారని, తాను కూడా ఏలూరు నుంచే రాజకీయాల్లోకి రావటం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని తెలిపారు. రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకోలేదు. ప్రజలంతా సిఎం జగన్‌కు తోడుగా ఉంటూ మరోసారి జిల్లాలో పార్టీ జెండా ఎగురవేసేలా పని చేయాలి. ఈ సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్, పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, వడ్డీలు కార్పొరేషన్ ఛైర్మన్ ముంగర సంజీవ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాలపద్మ పాల్గొన్నారు.

విన్నర్‌గా నిలిచిన గురజ జట్టు

నియోజకవర్గ క్రికెట్ పోటీలకు గురజ జట్టు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీల్లో మండలంలోని గురజ జట్టు విన్నర్‌గా నిలిచింది. శనివారం రాత్రి మండలంలోని సింగరాయపాలెం-గురజ జట్ల మధ్య హోరాహోరీగా సింగరాయపాలెంలో జరిగిన పోరులో సింగరాయపాలెం జట్టుపై గురజ జట్టు విజయం సాధించి విన్నర్‌గా నిలిచింది. మండల స్థాయి క్రికెట్‌లో విన్నర్‌గా నిలిచిన గురజ జట్టు కైకలూరు నియోజవర్గ స్థాయిలో త్వరలో జరగనున్న మ్యాచ్‌కి అర్హత సాధించింది. గురజ జట్టుకు పలువురు అభినందనలు తెలిపారు.

ఆర్థిక సాయం అందిస్తున్న జనసేన నేతలు

శస్త్రచికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

కార్యకర్తలకు జనసేన ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని రాఘవాపురం పంచాయతీ డిఎన్.రావుపేట గ్రామానికి చెందిన జన సైనికుడు అడపా కరిముల్లా ఇటీవల ఏలూరులో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. అతనికి ఆపరేషన్‌కు రూ.పది లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీని నిమిత్తం జనసైనికులందరూ కలిసి ఆర్థిక సాయం అందించారు. మొత్తం రూ.70 వేలు జనసేన పార్టీ మండలాధ్యక్షులు చీదారాల మధుబాబుతో కలిసి మేకా ఈశ్వరయ్య కరిముల్లా కరిముల్లాకు అందించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడం జనసేన పార్టీ బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ తూము విజయకుమార్, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబర్ నారపాము ఏసుబాబు, మండల ఉపాధ్యక్షులు కొత్తపల్లి సాయిబాబు, రాఘవాపురం గ్రామ అధ్యక్షులు పుప్పాల వెంకటేశ్వరావు, మండల కమిటీ కార్యదర్శి భవాని, ఎండపల్లి గ్రామ అధ్యక్షులు ముగ్గిరాల రాజకుమార్, మండల కార్యదర్శి భూసి ధర్మ, డిఎన్.రావుపేట, రాఘవపురం, పోతునూరు, గనిజర్ల గ్రామ జన సైనికులు పాల్గొన్నారు.

'సమస్యలను పట్టించుకోని ఎంఎల్ఎ'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు నియోజకవర్గంలోని 12వ డివిజన్ దక్షిణపు వీధిలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా ఆళ్ల నాని కాలయాపన చేస్తున్నారని రెడ్డి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. దక్షిణపు వీధిలోని బోండావారివీధిలో ఆయన పర్యటించి అక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దక్షిణపు వీధిలో ఉన్న మార్కండేయ స్వామి వారి ఆలయం రహదారిలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రెయిన్ పొంగి మురుగ రోడ్డు మీదకు వచ్చి దుర్వాసన వెదజల్లుతోందని, స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని డివిజన్‌లోని కార్పోరేటర్ కర్రి శ్రీనివాసరావుకు ఎన్నిసార్లు చెప్పినా ఈ సమస్యకు పరిష్కారం చూపకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. దీనిపై ఎంఎల్ఎ ఆళ్ల నాని, మేయర్ నూర్జహాన్, మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. ఏలూరులోని అన్ని డివిజన్‌లో ఇలా పర్యటిస్తానని, నియోజకవర్గంలో ఉన్న ప్రతిఒక్క సమస్యపై ఇలాగే పోరాడుతామని తెలిపారు.

అన్నదానం చేస్తున్న పుసుపులేటి కుటుంబీకులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఆంధ్రజ్యోతి విలేకరి జయవరపు ఆదిశేషు అమ్మమ్మ శతాధిక వృద్ధురాలు పసుపులేటి వరహాలమ్మ (105) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె జ్ఞాపకార్థం స్థానిక మహాత్మ గాంధీ స్మారక వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు జయవరపు రామాయమ్మ, శివరామకృష్ణ శివజ్యోతి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని, ఇందుకోసం అధికారులు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ జాయింట్ సెక్రటరీ, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పర్యవేక్షకురాలు నండూరి ఉమా కోరారు. మండలంలోని గుణ్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ సర్పంచి తానిగడప సుజాత ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్యాలు, స్కిట్స్ పలు కార్యక్రమాలు నిర్వహించారు. భారత్ ఆయుష్మాన్ ఐడీ కార్డు, మహిళా లబ్ధిదారురాలకు ప్రధానమంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. అనంతరం ఉమాను, జిల్లా నోడల్ అధికారి, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బి.మోహినివెంకన్నబాబు, అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ టి.శ్రీపూజ, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిపిఒ టి.విశ్వనాథశ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ, పశు సంవర్ధక శాఖ జెడి నెహ్రూబాబు, డ్వామా పీడీ ఎ.రాము, డిసిసిబి డైరెక్టర్ జంగా వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద పోలీసులు తెలంగాణ మద్యం స్వాధీనం చేసుకున్నారు. తనిఖీ కేంద్రం ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తెలంగాణ రాష్ట్రం నుంచి బుట్టాయగూడెం మండలంలోని కోయరాజమండ్రి గ్రామానికి తరలిస్తున్న ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ టి.రాధాకృష్ణ తెలిపారు. ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

భవనాలే ఉన్నాయి.. పరికరాలు లేవు..!

భీమడోలు సిహెచ్‌సిలో పరిస్థితి
పూర్తిస్థాయిలో వైద్య సేవలందని వైనం
అధికారులు స్పందించాలని ప్రజల వేడుకోలు

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్ర నూతన ఔట్ పేషెంట్ బ్లాక్ భవనం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి అదనపు భవనాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. కానీ దీనికి అనుగుణంగా వైద్యులు సేవలందించేందుకు పరికరాలు, ఇతరాలు అందుబాటులోనికి రాకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. 2007లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పునర్వవస్థీకరణలో భాగంగా జిల్లాలోని భీమడోలు, దెందులూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో వీటి ద్వారా అందించాల్సిన సేవలను సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయికి మాత్రమే సరిపడే విధంగా పరిమితం చేశారు. ఆ తర్వాత కాలంలో 2011 నుంచి జిల్లాలోని సామాజిక ఆరోగ్య కేంద్రాల స్థాయి సేవలు పెరిగాయి. ఈ తరహాలో ప్రస్తుత ఏలూరు జిల్లాలో ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు జరిగింది. భీమడోలు, దెందులూరు కేంద్రాలు అప్‌గ్రేడ్ అయ్యాయి. నూతనంగా ఏర్పడిన మూడు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు మాత్రమే పూర్తి సేవలు అందుబాటులోకి వచ్చాయి. దానికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు సైతం ప్రభుత్వం చేసింది. ఇక భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానంగా తల్లీ బిడ్డల ఆరోగ్యం, ఆరోగ్యశ్రీ సేవలు, ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇదేవిధంగా ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి ఆరోగ్య కేంద్రంగా భీమడోలు గుర్తింపు పొందింది. ఇదే క్రమంలో కోవిడ్ సేవలందించేందుకు ఆరోగ్య కేంద్రానికి ప్రత్యేక అనుమతులు లభించాయి. ఆ మేరకు పూర్తిస్థాయి సేవలను ఆరోగ్య కేంద్రం గతంలో అందించింది.

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పడినప్పుడు రెండు లక్షల జనాభాకు అందుబాటులో ఉన్న ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సామాజిక ఆరోగ్య కేంద్రం అనుబంధంగా పనిచేసేవి. తాజాగా వచ్చిన మార్పుల నేపథ్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఉండే అనుబంధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను పరిమితం చేశారు. దీనిలో భాగంగా గుండుగొలను, పూళ్ల, సిహెచ్.పోతేపల్లి, ద్వారకాతిరుమల, చేబ్రోలు, నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు దీని పరిధిలోకి వచ్చాయి. సాధారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తమ పరిధి దాటిన సేవల కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రిఫర్ చేయాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణ భాగంగా ప్రాథమిక ఆరోగ్య యంత్రాలతో పాటు మెరుగైన ఆరోగ్య పరిరక్షణ భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా ఆరోగ్య సేవలను అందించాల్సి ఉంది. సామాజిక ఆరోగ్య కేంద్రం వార్షిక ప్రసవాల సంఖ్య 300 కాగా కొంతమేరకు ఆ సంఖ్య తగ్గుతుంది. సదరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర బాధ్యులు ప్రసవాలను చేసేందుకు ఆసక్తి కనపర్చకపోవటం ఇందుకు ఒక కారణమన్న ఆరోపణలు ఉన్నాయి.

భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాలు వేసేందుకు గైనిక్, మత్తు వైద్యులు, శస్త్ర చికిత్స, నవజాత శిశువుల చికిత్స కోసం ప్రత్యేక వైద్యులు, చిన్నపిల్లల వైద్యుల నియామకం జరిగింది. దానికి అవసరమైన పరికరాలతో పాటు రక్త నిల్వకేంద్రం, ఎక్స్ రే, గర్భిణులకు పరీక్షల కోసం స్కానింగ్ వంటి అదనపు ఏర్పాట్లు ఉన్నాయి. ప్రసవానికి ముందు అనంతరం సేవలందించేందుకు అవసరమైన ప్రత్యేక వార్డులు అందుబాటులో ఉంచారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా దంత, నేత్ర వైద్యంతో పాటు ఎముకలకు సంబంధించిన చికిత్స కోసం డిప్యూటేషన్‌పై ఒక వైద్యుని నియామకం జరిగింది. వీటితో పాటు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సేవలందించేందుకు ఐసిటిసి కేంద్రం, క్షయ వ్యాధిగ్రస్తులకు సేవలందించేందుకు ప్రత్యేక విభాగం అందుబాటులో ఉన్నాయి. ఇక ల్యాబ్ ద్వారా 24 గంటల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఇసిజి సేవలు సైతం అందుబాటులో ఉన్నాయి. దీర్ఘకాలిక రోగుల కోసం ఎన్‌సిడి వైద్య విభాగం ప్రత్యేకంగా అందుబాటులో ఉంది. పిపిపి పద్ధతిన కొంతమేరకు వైద్య సేవలందుతున్నాయి. భీమడోలు కేంద్రంగా ఎముకల సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారి కోసం ప్రతివారం సదరం శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతినిత్యం 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించడంతోపాటు రోజుకు 25 మందికి తగ్గకుండా ఇన్ పేషెంట్లు సేవలను అందుకుంటున్నారు. నూతన భవన నిర్మాణంతో పాటు పోస్టుమార్టం, మార్చురీ భవనాలు నిర్మించారు.

సేవలందించేందుకు తగు సిబ్బంది ఉన్నారు. కాని పరికరాలు లేని కారణంగా ఆ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వాస్తవానికి రెండు జాతీయ రహదారుల మధ్యలో ఉన్న భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ద్వారా రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సేవలందించేందుకు భీమడోలుకు ప్రత్యేక కేంద్రంగా సేవలందించే వెసలుబాటు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక ఆయుష్ భవనం ద్వారా గతంలో సేవలు అందుబాటులో ఉండేవి. కాని ప్రస్తుతం సిబ్బంది లేకపోవడంతో అక్కడ సేవలు నిలిచిపోయాయి.

ఈ విషయాలపై సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య పర్యవేక్షకులు డాక్టర్ నాగదేసి సునీతను వివరణ కోరగా సామాజిక ఆరోగ్య కేంద్రానికి అందుబాటులో ఉన్న సేవలు పూర్తిస్థాయిలో అందిస్తున్నామన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్య విషయమై అవసరమైన వారికి చికిత్స అందించేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక కేంద్రానికి ఒక ఫిజీషియన్, ఒక నవజాత శిశువుల వైద్యుల పోస్టులతో పాటు ఇద్దరు నర్సుల సేవలు అందుబాటులోకి రావాల్సి ఉంది. సామాజిక ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన ఏర్పాట్లు, ఇతర అవసరాల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు.

వైఎస్ఆర్ స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయరాజు

ప్రజాశక్తి - చింతలపూడి

కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తితో రాజకీయాలకు వచ్చినట్లు వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభంపాటి విజయరాజు అన్నారు. పట్టణంలోని ఎఎంసి వద్ద ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో వైసిపి మండల కార్యకర్తల, నాయకులతో ఆదివారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ నిరు పేదలకు సేవ చేయలనే తపన ఉందన్నారు. ఆ తపనతోనే రాజకీయాలకు వస్తున్నట్లు చెప్పారు. ప్రతి కార్యకర్తకు, నాయకులకు అండగా ఉంటామన్నారు. నియోజకవర్గంలో రోడ్ల సమస్యలు గుర్తించామని, పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటీ నిరజసుధాకర్, గిరి భోగరావు, పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఈ సమావేశానికి మరొక గ్రూపు గైర్హాజరు

మండలంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి మరొక గ్రూపు గైర్హాజరవ్వడం చర్చనీయాంశంగా మారింది. వారికి మరోకరోజు సమావేశం నిర్వహించనున్నట్లు చెబుతున్నారు.

గోపవరంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని గోపవరం గ్రామం మూడో వార్డులో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పలపాటి గణేష్, వడ్లపట్ల మురళీమోహన్, సాయల జగ్గారావు, పొలిమెట్ల శ్రీను, సాయల శ్రీను, కర్ర ఏసుపాదం, సాయల అనిల్, బల్లావరపు రెడ్డి, కుప్పాల శివశ్రీను పాల్గొన్నారు.

'బిసిల ద్రోహి జగన్'

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

సిఎం జగన్ బిసిల ద్రోహి అని, బిసిలను రాజకీయంగా పైకి తెచ్చిన ఘనత ఎన్‌టిఆర్, చంద్రబాబులదేనని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లిలో ఆదివారం నిర్వహించిన జయహో బిసి కార్యక్రమం సందర్భంగా పురవీధుల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రమేష్, పార్టీ మండలాధ్యక్షులు ఎం.కోటేశ్వరరావు, టౌన్ పార్టీ అధ్యక్షులు పి.నరసింహరావు, నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు ఎ.శ్రీనివాసరావు, నాయకులు సిహెచ్.శివరామకృష్ణ, కె.మంగయ్య, జనసేన పార్టీ నాయకులు ఎం.శివరామకృష్ణ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టియు నేత నాగేశ్వరరావు అరెస్టు అన్యాయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అరెస్టు చేసిన నాగేశ్వరరావును వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గౌరీపట్నం ఏరియా ఐఎఫ్‌టియు ఉద్యమ నాయకులు పి.నాగేశ్వరావును ప్రభుత్వం అన్యాయంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. కార్మికుల కోసం, కష్టజీవుల కోసం నిరంతరం పనిచేసే ఉద్యమ నాయకులను అక్రమ అరెస్టులు చేయటం సరికాదన్నారు. ప్రభుత్వాలు కార్మిక సమస్యలు పరిష్కరించనప్పుడు కార్మిక ఉద్యమాలు చేయటం రాజ్యాంగ హక్కు అని ప్రభుత్వానికి తెలియదా అని ప్రశ్నించారు. 41 రోజుల నుంచి సుదీర్ఘ దీక్ష, ఐదు రోజుల నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీల పట్ల వివక్ష చూపించడం ప్రభుత్వ హేయమైన చర్య అని విమర్శించారు. తక్షణం ప్రభుత్వం చర్చలకు పిలిచి అంగన్వాడీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్మికుల పోరాటానికి సంఘీభావంగా, వాళ్లకు అండగా నిలబడిన ఐఎఫ్‌టియు నాయకులను అక్రమ అరెస్టులు చేయటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, లేకపోతే తమ ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అక్రమంగా కంకర తవ్వకాలు

చర్యలు తీసుకోని అధికారులు
ప్రజల నుంచి విమర్శలు

చేబ్రోలులో కంకర తవ్వకాలు జరిగిన ప్రాంతం

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేబ్రోలులో ప్రభుత్వ పోరంబోకు భూమిలో (ఎర్రగుంట చెరువు) కంకర తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని గ్రామస్తులు, వార్డు సభ్యులు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి రాత్రిళు చడీ చప్పుడు లేకుండా పెద్ద ఎత్తున కంకర తవ్వి అమ్మేస్తున్నారని చెబుతున్నారు. దీనిపై సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు వార్డు సభ్యుడు మూర్తి చెప్పారు. గతంలో ఇదే తరహాలో కంకర తవ్వకాలను అడ్డుకుని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వానికి నిబంధనల మేరకు ఫీజు చెల్లించకుండా, అనుమతులు లేకుండా మట్టిమాఫియా ఇదంతా చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని అధికారులను కోరుతున్నారు. కంకర తవ్వకాలపై గ్రామస్తులు ఫిర్యాదు చేశారని, ఎర్రగుంట చెరువు భూమిలో విఆర్‌ఎలను రాత్రి సమయంలో కాపలా ఉంచినట్లు చేబ్రోలు విఆర్‌ఒ ఈశ్వరి తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలపై

ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని 41 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని ఎఐటియుసి రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకటరామారావు అన్నారు. ఏలూరులో ఎఐటియుసి జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఎఐటియుసి జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరామారావు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, 2019 ఎన్నికల సందర్భంగా జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిటైర్మెంట్ అయిన అంగన్వాడీ వర్కర్లకు రూ.ఐదు లక్షలు గ్రాడ్యుటీ చెల్లించాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి, సమ్మె విరమణకు ప్రయత్నించకుండా అంగన్వాడీ వర్కర్లు, ఆయాల మీద ఎస్మా చట్టం ప్రయోగించి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అంగన్వాడీలకు న్యాయం చేయాలని, లేకపోతే అంగన్వాడీల ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

23న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

వంగాయగూడెం గుడ్ సమరిటన్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో ఈ నెల 23న నారాయణపురం కాలువ గట్టు ఎస్‌సి పేటలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు లవ్ ఇన్ యాక్షన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు తెలిపారు. సాధారణ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి వైద్యం అందించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్‌టియు జిల్లా కమిటీ

'ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ నిర్వీర్యం'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ విధానాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ అన్నారు. ఎస్‌టియు జిల్లా 77వ కౌన్సిల్ సమావేశాలు స్థానిక సంఘ భవనంలో ఆదివారం పి.నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని, వాగ్దానం చేసిన విధంగా ఒపిఎస్‌ను అమలు చేసి, 12వ పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా శామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్, ఆర్థిక కార్యదర్శిగా రాము ఎన్నికయ్యారు.

ఎస్‌టియు జిల్లా అధ్యక్షులుగా శామ్యూల్

చింతలపూడి :ఎస్‌టియు (ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం) జిల్లా అధ్యక్షులుగా ముప్పిడి శామ్యూల్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ ఉద్యోగ సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేస్తున్నందుకు తనను జిల్లా అధ్యక్షులుగా రాష్ట్ర కమిటీ నియమించినట్లు ముప్పిడి శ్యాముల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

వికలాంగుడికి మూడు చక్రాల సైకిల్ అందజేత


వికలాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి - చింతలపూడి

ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుదని ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెంలో వికలాంగుడైన భూక్యా బాలుకు బొప్పన రాధమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా టిడిపి ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిల్ అందించారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వికలాంగులను సిఎం జగన్ పట్టించుకోవడంలేదన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో వికలాంగులకు మోటార్ సైకిళు కూడా అందించేవారమని, ప్రస్తుత వైసిపి ప్రభుత్వం వికలాంగుల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న నారా లోకేష్‌ని, భువనేశ్వరిని ఆదర్శంగా తీసుకొని టిడిపి ఆధ్వర్యంలో సహాయ కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. వికలాంగులకు సంక్షేమ ఫలాలు అందించేది తెలుగుదేశం పార్టీనే అని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి నియోజకవర్గ మహిళా నాయకురాలు యాళ్ల లీలాప్రశాంతి, బిసి సెల్ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్, కొమ్ము తిరుపతిరావు, బిసి నాయకులు చక్రారపు మారేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి వనితతో వైసిపి నాయకులు

మంత్రి వనితను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

సిఎం జగన్ ఆదేశాల మేరకు గోపాలపురం నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిగా నియమితులైన హోంమంత్రి వనితను వైసిపి ద్వారకాతిరుమల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలి పారు. వనితను కలిసినవారిలో పొనమాల ఉమా మహేశ్వరరావు, నాగరాజు, చిలుకూరి చంద్రశేఖర్, చెన్నూరి రామకృష్ణ, లింగాల యేసు, నాగచారి, హనుమంతు, ప్రసాద్, రమేష్, చిలుకూరు వెంకన్నబాబు, సిద్ధయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు సింగరాయపాలెంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠం వద్ద నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అష్టమ వార్షిక త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు రెండో రోజు ఆదివారం కొనసాగాయి. శనివారం ప్రారంభమైన త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారంతో ముగుస్తాయి. ఆదివారం సుదర్శన హోమం, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. సోమవారం సీతారాముల శాంతి కళ్యాణం, వృద్ధ కళాకారుల సన్మానం, నాదస్వరం కచేరి, ఊరేగింపు, అనంతరం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పొగమంచు.. ప్రజల అవస్థలు

ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
అనారోగ్యానికి గురవుతామని జనం భయాందోళన
జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యుల సూచన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పొగ మంచుతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పొగ మంచు దట్టంగా రోడ్లను అలుముకుపోవడంతో దారి కనపడక వాహనదారులు, జనం నానా తిప్పలు పడుతున్నారు. మండలంలోని జాతీయ, రాష్ట్రీయ రహదారులను పొగ మంచు కమ్మేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనదారులకు దగ్గరకు వచ్చే వరకు ఎదుటి వాహనం కనబడక, వాహనాలు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సార్లు పొగ మంచు కారణంగా దారి కనబడకపోవడంతో వాహనాలు కాలువల్లో, గుంతలో పల్టీ కొడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులుగా మారుతున్నారు. ఈ నెలలోనే పొగ మంచు కారణంగా మండలంలోని పలు రోడ్లల్లో అనేక ప్రమాదాలు జరిగాయి. మండల వ్యాప్తంగా పలు రహదారుల్లో మంచు ప్రభావంతో వాహనాలు పంట కాలువల్లో, డ్రెయిన్లలో పల్టీ కొట్టిన సంఘటనలు అనేకం ఉన్నాయి. తెల్లవారుజామున మొదలవుతున్న మంచు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. దీనికి తోడు చలి కూడా తోడు కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకపక్క పొగ మంచు, మరోపక్క వణికిస్తున్న చలితో జనం, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంచు ప్రభావంతో ఆర్‌టిసి బస్సులు గమ్యస్థానాలకు ఆలస్యంగా చేరుకుంటున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు వివిధ వృత్తుల్లో స్థిరపడిన వ్యక్తులు తమ విధులకు ఆలస్యంగా హాజరయ్యే పరిస్థితి ఏర్పడింది. పొగ మంచు ప్రభావం కారణంగా పేపర్ బాయ్స్, పాలు డెలివరీ చేసే బాయ్స్ ఆలస్యంగా పేపరు, పాలు డెలివరీ చేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పొగమంచుతో అటు వాహనదారులు, ఇటూ జనం తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పొగ మంచులో ప్రయాణం ప్రమాదకరమే కాక ప్రజలకు దగ్గు, జలుబు, ఊపిరితిత్తులు నిమ్ము, తుమ్ములు వంటి జబ్బులు వచ్చే అవకాశం ఉందని దేవపూడి పిహెచ్‌సి వైద్యాధికారి ఎం.వినయ్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మంచులో ప్రయాణించేవారు తలకు హెల్మెట్, ముక్కుకు మాస్కు, మంకీ క్యాప్ ధరించి తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని సూచించారు.